"సర్వ ప్రాప్తి సంపన్న జీవితము యొక్క విశేషత - అప్రసన్నతా ముక్తులు మరియు ప్రసన్నతా యుక్తులు"

ఈ రోజు ప్రేమ సాగరుడైన బాప్ దాదా తమ ప్రేమ స్వరూప ఆత్మలను చూస్తున్నారు. ప్రతి ఒక్కరి హృదయంలో పరమాత్మ ప్రేమ ఇమిడి ఉంది. ఈ పరమాత్మ ప్రేమ అనేది ప్రాప్తించడం కూడా ఒక్క జన్మలోనే ప్రాప్తిస్తుంది. 83 జన్మలు దేవాత్మల ద్వారా లేక సాధారణాత్మల ద్వారా లభించింది. ఆలోచించండి, గుర్తు చేసుకోండి, మొత్తము కల్పమంతా తిరిగి రండి - మీరు స్వదర్శన చక్రధారులు కదా! ఒక్క క్షణములో మొత్తము కల్పమంతా తిరిగి వచ్చారా? 83 జన్మలలో పరమాత్మ ప్రేమ లభించిందా? లభించలేదు. కేవలము ఈ సంగమములో ఈ ఒక్క జన్మలోనే పరమాత్మ ప్రేమ ప్రాప్తించింది. మరి తేడాను తెలుసుకున్నారు కదా! ఆత్మల ప్రేమ మరియు పరమాత్మ ప్రేమ - రెండింటిలో ఎంత తేడా ఉంది! సాధారణ ఆత్మల ప్రేమ ఎక్కడకు తీసుకువెళ్ళింది? అది ఏమి ప్రాప్తిని అందించింది - అనుభవమే కదా? మరియు పరమాత్మ ప్రేమ ఎక్కడకు తీసుకువెళ్తుంది? మీ మధురమైన ఇంటికి మరియు మధురమైన రాజధానికి. ఆత్మల ప్రేమ రాజ్య భాగ్యాన్ని పోగొడుతుంది మరియు పరమాత్మ ప్రేమ రాజ్య భాగ్యాన్ని ఇప్పిస్తుంది, అది కూడా ఈ జన్మలోనే. అలాగని మీరు కేవలము భవిష్యత్తు ఆధారముపైనే నడుస్తున్నారని కాదు. అలా కాదు. డైరెక్ట్ పరమాత్మ ప్రాప్తి అయితే ఇప్పుడే ఉంది. వర్తమానము ముందు భవిష్యత్తు కూడా అసలేమీ కాదు. స్వర్గములో ఏం ఉంటుంది మరియు ఏం ఉండదు అని మీరు పాట పాడుతారు కదా. మరి ఇప్పటి పాట ఏమిటి? పొందాల్సినదేదో పొందేసాము... లేక పొందాలా? పొందేసారు. పాండవులు పొందారా? గోపికల విషయంలోనైతే గాయనము ఉండనే ఉంది. బ్రాహ్మణుల ఖజానాలో అప్రాప్తి అన్న వస్తువేదీ లేదు అన్నది ఇప్పటి గాయనమే. దేవతల ఖజానాలో కాదు, బ్రాహ్మణుల ఖజానాలో అప్రాప్తి అన్నది లేదు. మరి ఇప్పుడు మీరు బ్రాహ్మణులే కదా? మరి అప్రాప్తి అన్న వస్తువేదీ లేదు అని అనుభవము చేస్తున్నారా? అంతేకాక ఈ ప్రాప్తులు అవినాశీ అయినవి, అల్పకాలికమైనవి కావు. మరి ఎవరికైతే సర్వ ప్రాప్తులూ ఉంటాయో, వారి జీవితములో ఏ విశేషత ఉంటుంది? అన్ని ప్రాప్తులు ఉన్నాయి, ఒక్కటి కూడా లోటు లేదు అన్నప్పుడు వారి నడవడికలో మరియు ముఖములో ఏ విశేషత కనిపిస్తుంది? సదా ప్రసన్నత. ఏమి జరిగినా సరే, సర్వ ప్రాప్తి స్వరూపులు తమ ప్రసన్నతను వదలలేరు. ఎప్పుడైనా అప్రసన్నత అనుభవమైతే చెక్ చేసుకోండి - అప్రాప్తి అనుభవం అవుతుందా లేక సర్వ ప్రాప్తులు అనుభవం అవుతున్నాయా.

ఈ రోజు బాప్ దాదా చాలానే సేవాకేంద్రాలను మరియు ఉప సేవాకేంద్రాలను చూసారు, విదేశాలలోనివి కావు, దేశములోనివి చూసారు. సేవాకేంద్రాలలోనైతే విశేషంగా సేవాధారులు ఉన్నారు. ఈ రోజు అంతా తిరుగుతూ సేవాధారులను మరియు సేవాస్థానాలను, రెండింటినీ చూసారు. ప్రతీ స్థానములోనూ, చిన్నవైనా లేక పెద్దవైనా, అన్నింటిలోనూ చెక్ చేసారు - సేవాధారులు తనువుతో, మనస్సుతో, ధనముతో మరియు సేవ యొక్క సంబంధ-సంపర్కాలతో ఎంత ప్రసన్నంగా ఉన్నారు? ఎందుకంటే విశేషమైనవైతే ఈ విషయాలే కదా! మరి ఏం చూసారు?

తనువైతే అందరిదీ పాతదే, యువత అయినా, పెద్దవారైనా, అక్కడక్కడ చిన్నవారు పెద్దవారికంటే బలహీనంగా ఉన్నారు, ఆ అనారోగ్యం పెద్దదే అయ్యి ఉండవచ్చు కానీ - నేను బలహీనుడిని, నేను అనారోగ్యంగా ఉన్నాను అనే ఈ ఫీలింగ్ అనారోగ్యాన్ని పెంచుతుంది ఎందుకంటే తనువు యొక్క ప్రభావం మనస్సుపై పడేటప్పటికి డబుల్ వ్యాధిగ్రస్తులుగా అవుతారు. తనువు మరియు మనస్సు, రెండింటిపరంగా డబుల్ వ్యాధిగ్రస్తులుగా అయిన కారణంగా పదే-పదే ఆత్మ-అభిమానులుగా అయ్యేందుకు బదులుగా వ్యాధి-అభిమానులుగా అవుతారు. కావున ఏం చూసారు? తనువు ద్వారానైతే మెజారిటీ, అనారోగ్యం అనండి లేక లెక్కాచారాలు తీర్చుకోవడం అనండి, అది చేస్తున్నారు కానీ 50 శాతం డబుల్ వ్యాధిగ్రస్తులుగా ఉన్నారు, 50 శాతం సింగిల్ వ్యాధిగ్రస్తులుగా ఉన్నారు. కానీ అసలు జరగాల్సింది ఏమిటి? ఎప్పుడూ కూడా మనస్సులో - నేను వ్యాధిగ్రస్తుడిని, నేను వ్యాధిగ్రస్తుడిని... అంటూ అనారోగ్యానికి సంబంధించిన సంకల్పాలను తీసుకురాకూడదు. కానీ జరిగేది ఏమిటి? నేను వ్యాధిగ్రస్తుడిని... అనే ఈ పాఠం పక్కా అయిపోతుంది. అప్పుడప్పుడు ఒక్కోసారి అనారోగ్యం ఏమీ ఉండదు కానీ మనస్సులో సంతోషం లేని కారణంగా, నాకు నడుం నొప్పి ఉంది అని సాకు చెప్తారు ఎందుకంటే మెజారిటీకి అయితే కాలు నొప్పి లేక నడుం నొప్పి ఉంటుంది. చాలా

సార్లు నొప్పి ఉండదు, అయినా కానీ నాకు నడుం నొప్పి ఉంది అని అంటారు. ఇప్పుడు అది ఎలా చెక్ చేయాలి? నడుం నొప్పి ఉందా, లేదా అన్నదానిని చెక్ చెయ్యటానికి డాక్టర్ల వద్ద ఏదైనా థర్మామీటర్ ఉందా? ఎక్స్-రేలు అవీ చేయించాలంటే వాటికి ఇంకా ఎక్కువ ఖర్చు అవుతుంది. కావున ఏం చూసాము అంటూ తనువు గురించి వినిపించాము. చాలామంది సేవాధారులు ఇలా కనిపించారు. మీరందరూ సేవాధారులే. ఇది కేవలము టీచర్ల విషయమే అని అనుకోకండి. ప్రవృత్తిలో ఉన్న మీరు కూడా సేవాధారులే కదా? లేక ఎవరైతే సెంటర్లలో ఉంటారో, వారే సేవాధారులా? ప్రవృత్తిలో ఉండే మీరు కూడా సేవాధారులే. ఎప్పుడైనా మీ ఇళ్ళను కూడా తిరిగి చూస్తాము. ఎలా నిద్రపోతున్నారు, ఎలా లేస్తున్నారు, డబుల్ బెడ్ ఉందా, సింగిల్ బెడ్ ఉందా, ఇవన్నీ చూస్తాము. అచ్ఛా, ఇది ఈ రోజు తిరిగినదాని విషయము.

ఈ రోజుల్లో మందులు వేసుకోవటాన్ని పెద్ద విషయముగా భావించకండి ఎందుకంటే కలియుగ వర్తమాన సమయములో అన్నింటికంటే శక్తిశాలీ ఫలాలు ఈ మందులే. చూడండి, అవి రంగురంగులలో ఉంటాయి కదా. కలియుగ అంతిమములోని ఫలాలు ఇవే, కనుక ప్రేమగా వేసుకోండి. మందులు వేసుకోవడమంటే అది అనారోగ్యాన్ని గుర్తు తెప్పించదు. ఒకవేళ మందులను తప్పదు అన్నట్లుగా వేసుకుంటే అలా వేసుకునే మందులు అనారోగ్యాన్ని గుర్తు తెప్పిస్తాయి, కానీ శరీరాన్ని నడిపించటానికి అవి ఒక శక్తిని నింపుతున్నాయి అన్న స్మృతితో వేసుకుంటే ఆ మందులు అనారోగ్యాన్ని గుర్తు తెప్పించవు, అవి సంతోషాన్ని కలిగిస్తాయి, కనుక కేవలం రెండు-మూడు రోజులలో మందులతో బాగైపోతారు. ఈ రోజుల్లోనైతే చాలా క్రొత్త ఫ్యాషన్ వచ్చింది, కలియుగంలో అన్నింటికంటే ఎక్కువగా జరిగే ఆవిష్కరణ ఈ రోజుల్లోని మందులు లేక రకరకాల థెరపీలు. ఈ రోజు ఫలానా థెరపీ, మరో రోజు మరో థెరపీ, కనుక ఇవి కలియుగ సీజన్ లో వచ్చే శక్తిశాలీ ఫలాలు, అందుకే గాభరా పడకండి. కానీ మందుల కాన్షస్ గా లేక అనారోగ్యం కాన్షస్ గా అయి వేసుకోకండి. తనువుకు అనారోగ్యం వచ్చేదే ఉంటుంది, ఇది కొత్త విషయమేమీ కాదు, అందుకే అనారోగ్యానికి ఎప్పుడూ గాభరా పడకండి. అనారోగ్యం వచ్చింది, దానికి కాస్త ఫలాలను తినిపించండి మరియు వీడ్కోలు ఇచ్చేసెయ్యండి. అచ్ఛా, ఇది తనువు యొక్క రిజల్టు. ఇంకా ఏం చూసారు?

మనస్సు. మనస్సులో ఏం చూసారు? ఒక సంతోషకరమైన విషయం ఏమి చూసారంటే, మెజారిటీగా ప్రతి ఒక్క సేవాధారి మనస్సులో తండ్రి ప్రేమ మరియు సేవా ఉల్లాసము, రెండూ ఉన్నాయి. ఇకపోతే 25 శాతంవారు ఏదో తప్పదు కదా అన్నట్లు నడుస్తున్నారు, వారిని వదిలేయండి. కానీ మెజారిటీవారి మనస్సులో ఈ రెండు విషయాలను చూసారు. అంతేకాక ఇది కూడా చూసారు - తండ్రిపై ప్రేమ ఉన్న కారణంగా యోగంలో కూడా శక్తిశాలిగా అయ్యి కూర్చోవటంలో, నడవటంలో, సేవ చెయ్యటంలో చాలా అటెన్షన్ పెడతారు. కానీ ఆట ఏం జరుగుతుందంటే - స్మృతి అనే సీటుపై చాలా బాగా సెట్ అయ్యి కూర్చోవాలని కోరుకుంటారు కానీ కొద్ది సమయము సెట్ అవుతారు, మళ్ళీ ఇటూ-అటూ కదలటం మొదలవుతుంది. చిన్న పిల్లవాడు ఉన్నాడనుకోండి, అతడిని ఎక్కువ సమయం సీటుపై కూర్చోపెడితే తప్పకుండా కదులుతాడు. అలాగే మనస్సు కూడా ఒకవేళ కంట్రోల్ లో లేక ఆర్డర్ లో లేకపోతే కొద్ది సమయం చాలా బాగా కూర్చుంటారు, నడుస్తారు, సేవ కూడా చేస్తారు కానీ ఒక్కోసారి సెట్ అవుతారు, ఒక్కోసారి అప్సెట్ కూడా అవుతారు. దీనికి కారణమేంటి? కోరుకుంటుందేమో సెట్ అవ్వాలని, మరి అప్సెట్ ఎందుకు అవుతారు? కారణమేమిటి? ఏకాగ్రతా శక్తి, దృఢతా శక్తిలో లోటు. ప్లాన్ చాలా బాగా ఆలోచిస్తారు, ఇలా కూర్చుంటాము, ఇలా అనుభవం చేస్తాము, తర్వాత ఈ సేవ చేస్తాము, ఆ తరువాత ఇలా నడుస్తాము, కానీ కర్మ చేసేటప్పుడు లేక కూర్చుని-కూర్చుని కూడా దృఢతా శక్తి తగ్గిపోతుంది. ఇతర విషయాల వైపుకు మనస్సు-బుద్ధి చెల్లాచెదురు అయిపోతాయి. పనిలో బిజీగా లేకపోయినా కానీ వ్యర్థ సంకల్పాలు, ఇవి అన్నింటికంటే పెద్ద పని, ఇవి తమవైపుకు లాక్కుని వెళ్ళిపోతాయి. కనుక స్థూలమైన పని లేకపోయినా కానీ దృఢతా శక్తి చెల్లాచెదురు అయిపోయిన కారణంగా మనస్సు, బుద్ధి సీటుపై సెట్ అయ్యేందుకు బదులుగా అలజడిలోకి వచ్చేస్తాయి.

బాప్ దాదా మీ అందరికీ ఏదైతే పని ఇచ్చారో, దానిని చూసారా. బాప్ దాదా వద్దకు అందరి చీటీలు చేరుకున్నాయి. కానీ చాలామంది పిల్లలు చాలా తెలివైనవారు. ఏ తెలివి చూపిస్తారు? చీటీ వ్రాస్తారు, కానీ పేరు వ్రాయరు. బాబాకైతే తెలుసు కదా అని అనుకుంటూ అలా చేస్తారు. బాబాకు తెలుసు, కానీ ఒక పని ఇచ్చారంటే ఆ పనిని పూర్తిగా చెయ్యండి కదా. ఒకవేళ టీచర్ ఏదైనా వ్రాసి తీసుకురమ్మని చెప్తే, నాకు ఇది వ్రాయడం వచ్చు అన్న సంగతి మీకు తెలుసు కదా అని టీచర్ తో అంటే టీచర్ ఒప్పుకుంటారా? అలా చాలామంది పేరే వ్రాయరు. కానీ ఏ గ్రూప్ కు ఏ పని ఇవ్వటం జరిగిందో, అందులో మెజారిటీలో సంతోషకరమైన విషయం ఏం చూసారంటే - మేము డైమండ్ జూబ్లీ కల్లా చేసి చూపిస్తాము అని

అందరూ వ్రాసారు. మెజారిటీ ఇలా వ్రాసారు. మీకు కూడా అలాగే అనిపిస్తుందా? జీవన్ముక్తులుగా అయిపోతారా? ఒకవేళ అన్ని విషయాల నుండి ముక్తులుగా అయితే ఏం అవుతారు? జీవన్ముక్తులుగా అయిపోతారు కదా. కావున అందరూ తమ ధైర్యాన్ని, ఉల్లాసాన్ని మంచిగా చూపించారు, అది విదేశీయులైనా లేక భారతవాసులైనా, ఉల్లాస-ఉత్సాహాలు అందరివీ చాలా బాగున్నాయి. కొద్దిమంది మాత్రం, చాలా తక్కువమందే, మాకు సమయం పడుతుంది అని వ్రాసారు. వారికి సమయం పడితే పట్టనివ్వండి. మీరైతే జీవన్ముక్తులుగా అయిపోండి. కావున రిజల్టులో ఏం చూసారంటే - ఈ డైమండ్ జూబ్లీలో ఏదైనా చేసి చూపించాలి అనే ఉల్లాసము అందరికీ ఉంది. కానీ బాప్ దాదా చూసారు - మిమ్మల్ని మీరు వజ్రంగా తయారుచేసుకోవటానికి ఎంతగానైతే ఉల్లాస-ఉత్సాహాలు ఉన్నాయో, అంతగానే డైమండ్ జూబ్లీ సంవత్సరములో సేవ ప్లాన్లు కూడా చాలా వేగవంతమైనవి తయారుచేసారు. వేగవంతమైనవి తయారుచేసారు, దీనికి బాప్ దాదా సంతోషంగా ఉన్నారు, కానీ తర్వాత ఇలా అనకండి - సేవా భారం చాలా ఉంది కదా, అందుకే కాస్త కింద-మీద అయిపోయింది అని. బాప్ దాదాకు ఇలా వద్దు. ఏ సేవ అయితే స్వయాన్ని లేక ఇతరులను డిస్టర్బ్ చేస్తుందో, అది సేవ కాదు, స్వార్థమవుతుంది. మరియు ఏదో ఒక స్వార్థం నిమిత్తమవుతుంది, అందుకే కింద-మీద అవుతారు. ఎప్పుడైతే, స్వయానిదైనా లేక ఇతరులదైనా స్వార్థము పూర్తి అవ్వదో, అప్పుడే సేవలో డిస్టర్బెన్స్ (అలజడి) కలుగుతుంది, అందుకే స్వార్థము నుండి అతీతముగా మరియు సర్వుల సంబంధంలో ప్రియముగా అయ్యి సేవ చెయ్యండి. అప్పుడు, డైమండ్ జూబ్లీలో - డైమండ్ గా అయ్యి డైమండ్ జూబ్లీని జరుపుకుంటాము అన్న సంకల్పమునేదైతే చేసారో లేక లక్ష్యమునేదైతే పెట్టుకున్నారో, అది పూర్తి కాగలదు. కేవలం సగమే గుర్తు పెట్టుకోకండి. చాలామంది ఎలా జవాబు ఇస్తారంటే - డైమండ్ జూబ్లీని జరుపుకునేది ఉంది కావున జరుపుకున్నాము, అందులో బిజీ అయిపోయాము. కానీ బాప్ దాదా చెప్పిన రెండు మాటలనూ గుర్తుపెట్టుకోండి, సగం కాదు. డైమండ్ గా అయ్యి డైమండ్ జూబ్లీని జరుపుకోవాలి. కేవలము జరుపుకోవటమే కాదు, డైమండ్ గా అయ్యి జరుపుకోవాలి. కావున 'జరుపుకున్నాము కదా' అంటూ కేవలం మీకు అనుకూలించే అర్థాన్ని మాత్రమే తీసుకోకండి. డైమండ్ గా అయ్యి జరుపుకున్నారా? డైమండ్ గా అయ్యి జరుపుకోవటమే డైమండ్ జూబ్లీ లక్ష్యము. కనుక సగం లక్ష్యాన్ని పూర్తి చెయ్యకండి. రెండూ ఉండాలి - తయారవ్వాలి మరియు జరుపుకోవాలి. కేవలము తయారవ్వటమూ కాదు, కేవలము జరుపుకోవటమూ కాదు. రెండూ తోడుతోడుగా ఉండాలి. మరియు మీ అందరికీ తెలుసు కూడా - మీరు డైమండ్ జూబ్లీని జరుపుకోవాలని లేక డైమండ్ గా అవ్వాలని ప్లాన్ ను తయారు చేసుకుంటున్నప్పుడు మీ అందరికంటే ముందు మాయ కూడా తన ప్లాన్ ను తయారు చేసుకుంటుంది. అందుకే ఇలా అనకండి - ఏం చెయ్యాలి బాబా, ధైర్యం తగ్గిపోయింది, మాయ చాలా తీవ్రంగా ఉంది, మాయను మీ వద్దనే పెట్టుకోండి. రాజ్యం చేసేది మీరు కానీ మాయను సంభాళించాల్సింది బాబానా! రాజ్యమైతే మీరే చెయ్యాలి కదా. మాయాజీతులే జగత్ జీతులుగా అవుతారు, కావున మాయను జయించకుండా జగత్ జీతులుగా ఎలా అవుతారు? అందుకే నలువైపులా అటెన్షన్ ప్లీజ్. అర్థమైందా? అచ్ఛా!

ఈ రోజు తిరిగి గమనించినదానిలో సగం వినిపించాము, మిగిలిన సగం తర్వాత వినిపిస్తాము. కొన్ని-కొన్ని సెంటర్లు చాలా బాగా అలంకరించబడి ఉన్నాయి, కొన్ని సింపుల్ గా ఉన్నాయి, కొన్ని చాలా రాయల్ గా ఉన్నాయి, కొన్ని మధ్యస్థంగా కూడా ఉన్నాయి. ఎక్కువమంది ఏమనుకుంటారంటే - సెంటర్ రాయల్ గా అనిపించాలి, ఎవరైనా వి.ఐ.పి.లు వస్తే వారికి సెంటర్ బాగుంది అని అనిపించాలి అని. కానీ ఆది నుండి ఇప్పటివరకు కల మీ (బ్రాహ్మణుల) నియమము ఏమిటంటే - చాలా సాధారణంగానూ ఉండకూడదు, అలా అని చాలా రాయల్ గానూ ఉండకూడదు. మధ్యస్థంగా ఉండాలి. బ్రహ్మను అయితే చాలా సాధారణంగా చూసారు, వారు సాధారణంగా ఉండేవారు. కానీ ఇప్పుడు సాధనాలు ఉన్నాయి, సాధనాలను ఇచ్చేవారు కూడా ఉన్నారు, అయినా కూడా ఏ కార్యము చేసినా మధ్యస్థంగా ఉండేటట్లు చెయ్యండి. వీరు ఏం పెట్టారో అర్థం కావటం లేదు అని కూడా ఎవరూ అనకూడదు, అలాగే వీరిది ఇప్పుడే రాజరికంగా ఉంది అని కూడా ఎవరూ అనకూడదు. కనుక ఈ రోజు పాఠం ఏమిటి? ముక్తులుగా అయితే అన్నింటి నుండి అయ్యారు కదా! అన్నింటి నుండి ముక్తులుగా అయ్యే ప్రతిజ్ఞను చేసారు కదా! దృఢంగా ఉన్నారా లేక ఇంటికి వెళ్ళిన తర్వాత 'కష్టము' అని అంటారా! దృఢంగా ఉండండి. డైమండ్ జూబ్లీలో మాయకు పాఠం నేర్పించి చూపించండి. మీరు మాస్టర్ సర్వశక్తివంతులు, తక్కువేమీ కాదు!

అచ్ఛా, డబల్ విదేశీయులు కూడా చాలామంది వచ్చారు. స్థాపనా కార్యము యొక్క డబల్ శోభ - డబల్ విదేశీయులు. ఎంత శ్రమతో, ఎంత యుక్తితో ఇక్కడకు చేరుకుంటారో బాప్ దాదాకు తెలుసు. ఒకవేళ తపన తక్కువైతే, చేరుకోవటం కూడా కష్టమనిపిస్తుంది. ఒకవైపేమో ధనం విలువ పడిపోయింది అని బాప్ దాదా వింటారు, మళ్ళీ సంవత్సరం చూస్తే

విదేశీయులు ఇంకా ఎక్కువగా వచ్చి ఉంటారు. ఇదీ ధైర్యమంటే. రష్యావారి గ్రూప్ కూడా వచ్చింది కదా! రష్యావారు టికెట్ ను ఎక్కడి నుండి తీసుకొచ్చారు? వీరి కథలు వినటానికి చాలా బాగుంటాయి. టికెట్ డబ్బులను ఎలా పోగు చేస్తారు అన్నదాని కథ చాలా బాగుంటుంది. ఇవన్నీ జరగవలసిందే. అది కాగితమే కదా, డాలర్ అన్నా, పౌండ్ అన్నా, అది కాగితమే కదా, కాగితమే అన్నప్పుడు కాగితం ఎంతవరకు నడుస్తుంది! బంగారానికి విలువ ఉంది, వజ్రానికి విలువ ఉంది, కాగితానికి ఏం విలువ ఉంది? ధనం విలువ పడిపోవాల్సిందే. మీ ధనమైతే అన్నింటికంటే ఎక్కువ విలువైనది. ఏ విధంగానైతే ప్రారంభంలో వార్తాపత్రికలలో వేయించారు కదా - ఓం మండలి రిచెస్ట్ ఇన్ ద వరల్డ్ (ప్రపంచంలోనే అన్నింటికంటే ధనవంతమైనది) అని. అప్పట్లో సంపాదించే సాధనం ఏదీ లేదు. బ్రాహ్మబాబాతో పాటు ఒకరిద్దరు సమర్పణ అయ్యారు మరియు వార్తాపత్రికలలో ప్రపంచంలోనే అన్నింటికంటే ధనవంతమైనది అని వేసారు. అలాగే ఇప్పుడు కూడా నలువైపులా స్థూల అలజడి జరుగుతుంది, అప్పుడు మీరు వార్తాపత్రికలలో వేయించాల్సిన పని ఉండదు. ఆ పత్రికలవారే మీ వద్దకు వస్తారు మరియు వారు స్వయమే - బ్రహ్మాకుమారీలు ప్రపంచంలోనే అందరికన్నా ధనవంతులు అని పత్రికలలో వేస్తారు, టి.వి.లో చూపిస్తారు ఎందుకంటే ఏం జరిగినా కానీ మీ ముఖాలు మెరుస్తూ ఉంటాయి. రోజులో తినటానికి రొట్టె దొరకకపోయినా కానీ మీ ముఖాలైతే మెరుస్తూనే ఉంటాయి. నలువైపులా దుఃఖం ఉంటుంది కానీ మీరు సంతోషంలో నాట్యం చేస్తూ ఉంటారు. దీనినే వేటగానికి వేట మరియు వేటకు మృత్యువు అని అంటారు. అందుకే బాప్ దాదా ఈ రోజు చెప్పారు - సత్యమైన బ్రాహ్మణులు ఎవరైతే ఉన్నారో, బ్రాహ్మణ జీవితంలో ఎవరైతే శ్రేష్ఠ జీవితం యొక్క లక్ష్యాన్ని పెట్టుకున్నారో, వారి విశేషత ప్రసన్నత. ఎవరైనా మిమ్మల్ని నిందిస్తున్నా కూడా మీ ముఖంపై దుఃఖపు అల రాకూడదు. ప్రసన్నచిత్తులుగా ఉండాలి. నిందించేవారు కూడా అలసిపోతారు... ఇలా ఉండటం సాధ్యమేనా? వారు ఒక గంట అన్నారు, కానీ నేను కేవలం ఒక్క క్షణమే అన్నాను అన్నట్లు కాదు. క్షణకాలమైనా మాట్లాడారు లేక ఆలోచించారు, ముఖంపై అప్రసన్నత వచ్చింది అంటే ఫెయిల్ అయిపోయినట్లు. ఎంతో సహనం చేసారు కదా, ఒక గంటసేపు సహనం చేసారు, కానీ తర్వాత బెలూన్ నుండి గ్యాస్ బయటకు వచ్చేస్తుంది. కనుక గ్యాస్ ఉన్న బెలూన్ లా అవ్వకండి. ఇంకా ఏం కావాలి? తండ్రి లభించారు, అంతా లభించింది - ఈ పాటనే పాడుతారు కదా. కనుక అటువంటి సమయంలో ఇలాంటి-ఇలాంటి విషయాలను గుర్తు చేసుకుంటే ముఖం మారదు. అలాగని వారి ముందు గట్టి-గట్టిగా నవ్వడం మొదలుపెట్టకండి, అలా చేస్తే వారు ఇంకా వేడెక్కిపోతారు. ప్రసన్నత అనగా ఆత్మిక మందహాసం. అది బాహ్యమైనది కాదు, ఆత్మికమైనది. కావున ఈ రోజు పాఠం ఏమిటి? సదా అప్రసన్నతా ముక్తులు మరియు ప్రసన్నతా యుక్తులు, డబల్ - అర్థమైందా? అచ్ఛా!

నలువైపులా ఉన్న బాప్ దాదా యొక్క ప్రేమ స్వరూప ఆత్మలకు, సదా స్వయాన్ని అప్రసన్నత నుండి విముక్తులుగా చేసుకునే తీవ్ర పురుషార్థీ ఆత్మలకు, సదా స్మృతి మరియు సేవల బ్యాలెన్స్ ద్వారా సేవలో సఫలతను పొందే భాగ్యవంతులైన ఆత్మలకు, సదా తండ్రిని ప్రత్యక్షం చేయాలనే ఉల్లాస-ఉత్సాహాలలో ఉండే దేశ, విదేశాలలోని పిల్లలందరికీ, తండ్రికి తమ శుభవార్తను వ్రాసేవారికి, తమ సేవ యొక్క ఉల్లాసాన్ని ఉంచుకునేవారికి, తండ్రికి సదా స్నేహీ మరియు సమీపులైన పిల్లలకు, బాప్ దాదా యొక్క ప్రియస్మృతులు మరియు నమస్తే.

వరదానము:- అఖండ స్మృతి ద్వారా విఘ్నాలకు వీడ్కోలును ఇచ్చే మాస్టర్ సర్వశక్తివాన్ భవ

సంగమయుగము విఘ్నాలకు వీడ్కోలును ఇచ్చే యుగము, వేటికైతే అర్ధకల్పము కొరకు వీడ్కోలును ఇచ్చేసారో వాటిని మళ్ళీ రానివ్వకండి. సదా గుర్తుంచుకోండి - మేము విజయీ రత్నాలము, మాస్టర్ సర్వశక్తివంతులము. ఈ స్మృతి అఖండంగా ఉన్నట్లయితే శక్తిశాలి ఆత్మల ముందు మాయ విఘ్నము రాదు. విఘ్నము వచ్చింది, అప్పుడు దానిని తొలగించారు అంటే అఖండము, అచలము అని అనరు, అందుకే 'సదా' అన్న పదంపై అటెన్షన్ పెట్టండి. సదా స్మృతిలో ఉండటం ద్వారా సదా నిర్విఘ్నముగా ఉంటారు మరియు విజయ ఢంకా మ్రోగుతూ ఉంటుంది.

స్లోగన్:- ఈశ్వరీయ సేవలో స్వయాన్ని ఆఫర్ చేసుకోవటమే బాప్ దాదా యొక్క అభినందనలను అందుకోవటము.